ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి

# ఆంధ్ర ప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 34 పేజీలు - 04 వెల - 04/- బుధవారం 6 నవంబర్ 2024

**విలేకరులు కావలెను**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి
నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ
పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు
ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు,
మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

# సరస్వతీ ప్లాంట్ బాధితులకు అండగా ప్రభుత్వం

**బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది**
**పవర్ ప్రాజెక్ట్ పేరుతో 400 ఎకరాల అటవీభూముల స్వాధీనం**
**డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ భరోసా**



నరసరావుపేట, ఆంధ్ర ప్రగతి నవంబర్ 05:
వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కుటుంబానికి చెందిన సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ భూములకు సంబంధించిన బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు. మంగళవారం పల్నాడు జిల్లాలోని మాచవరం మండలం.. వేమవరం, చెన్నాయపాలెం గ్రామాల్లోని సరస్వతి పవర్ ప్లాంట్ భూములను ఆయన పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.

మిగతా 2లో

# శాంతిభద్రతల పరిరక్షణలో కటువుగా ఉండాల్సిందే

**పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి**
**హోమంత్రి అనిత స్పష్టీకరణ**



**అనంతపురం, ఆంధ్ర ప్రగతి నవంబర్ 05:**
వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం **మిగతాది 2లో...**

# మండలానికో ఇంటర్ కళాశాల

**మంత్రి నారా లోకేశ్**
**ఇంటర్ విద్యపై మంత్రి లోకేశ్ సమీక్ష**
**ప్రైవేటు కాలేజీలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండాలన్న మంత్రి**
**ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు తీసుకోవాలని సూచన**



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 05:
ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మండలానికో ఇంటర్ కళాశాల ఏర్పాటునకు ప్రణాళికలు రూపొందించాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ నారా లోకేశ్ నేడు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉండవల్లిలోని నివాసంలో ఇంటర్ విద్యపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ప్రైవేటు కాలేజీలకు ధీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదివి ఐఐటీ, మెడిసిన్ వంటి పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల ఫోటోలను దినపత్రికల్లో ప్రచురించేలా కసరత్తు చేయాలన్నారు. **మిగతాది 2లో...**

# జనవరి కి జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇస్తాం.!

**-అక్రిడేషన్ల పాత జీవో ను సవరించి కొత్త జీవో ఇస్తాం.**

-ప్రమాద భీమా పథకాన్ని పునరుద్ధరిస్తాం.
-ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంతో
రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి వెల్లడి.

2లో




# వైసీపీ నేతలకు తొత్తులుగా నాడు అధికారులు.!

-బుగ్గన బంధువుకు భూమిని కట్టబెట్టిన వైనం.
-అప్పు ఇచ్చిన డబ్బులు అడుగుతుంటే ప్రాణాలు తీస్తామని బెదిరింపులు.
-పని కల్పిస్తామని విదేశాలకు తిసుకెళ్లి చిత్రహింసలు.
-నేతలకు మొరపెట్టుకున్న బాధితులు.
-మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట... మంత్రి ఫరూక్.

3లో

# నేడు మెగా డీఎస్సీ ప్రకటన

**మార్చిలో పరీక్ష నిర్వహించే అవకాశం**




ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 05:ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను సోమవారం విడుదల చేసిన విద్యాశాఖ ఇప్పుడు మెగా డీఎస్సీ ప్రకటనకు సిద్ధమైంది. ఈ నెల 6వ తేదీన మెగా డీఎస్సీ ప్రకటన విడుదల కానుంది. దరఖాస్తుల ప్రక్రియ కూడా రేపటి నుంచే ప్రారంభమవుతుంది. నెల రోజుల పాటు అంటే డిసెంబర్ 6వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణకు సమయం ఇచ్చే అవకాశం ఉంది. ఫిబ్రవరి 3వ తేదీ నుంచి మార్చి 4వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటన విడుదల కానుంది. ఇందులో ఎస్జీటీ 6371 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్లు 7725 పోస్టులు, టీజీటీ 1781 పోస్టులు, పీజీటీ 286 పోస్టులు,, ప్రిన్సిపల్ 52 పోస్టులు, పీఈటీ 132 పోస్టులు ఉండనున్నాయి. ఎస్జీటీ పోస్టులు అత్యధికంగా కర్నూలు జిల్లాలో ఉన్నాయి. కాగా, డీఎస్సీని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తుండటంతో అనేక విడతల్లో పరీక్ష నిర్వహించాల్సి వస్తుంది. ముఖ్యంగా ఎస్జీటీ పోస్టులకు సంబంధించిన పరీక్ష నిర్వహణకు వారం రోజుల సమయం పడుతోంది. దీంతో పరీక్షల ఫలితాలను నార్మలైజేషన్ చేసి విడుదల చేస్తున్నారు. ఈ సమస్య లేకుండా ఉండేందుకు రెండు, మూడు జిల్లాలకు ఒకేసారి పరీక్ష నిర్వహిస్తే ఎలా ఉంటుందని విద్యా శాఖ యోచిస్తోంది. ఏపీలో టెట్ ఫలితాలు నిన్ననే విడుదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా టెట్ కోసం 4,27,300 మంది దరఖాస్తు చేసుకోగా.. 3,68,661 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 1,87,256(50.79 శాతం) మంది అర్హత సాధించారు.



2లో

# నిత్యకృత్యంగా అత్యాచారాలు

**120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయి**
**రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం**
**మాజీమంత్రి రోజా విమర్శలు**

# విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

**ఇచ్చిన హామీ మేరకు టారిఫ్ తగ్గించండి**
**గత ప్రబుత్వం పాపాలంటూ భారం మోపుతారా**
**ప్రభుత్వ తీరుపై పిసిసి చీఫ్ షర్మిల విమర్శలు**




ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 05: విద్యుత్ ఛార్జీలపై ప్రజలను మోసం చేస్తూ వారిపై భారం మోపితే ఊరుకునేది లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల విమర్శలు చేశారు. ఎవరి పాపమో అన్నది పక్కనపెట్టి ప్రస్తుత ప్రభుత్వం ప్రజలపై భారం పడకుండా చూడాలన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపాల గురించి ప్రస్తావించడం కాదని, ఆ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సింది పోయి, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తిన మోపేందుకు కూటమి సర్కార్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రూ.18వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల వసూళ్ల విషయంలో మా తప్పేం లేదని, మాకసలు సంబంధమే లేదని, భారం మాది కాదని, ప్రజల మీదే ఆ మొత్తాన్ని మోపుతున్నారని విరుచుకుపడ్డారు. విద్యుత్ ఛార్జీల గురించి కూటమి ప్రభుత్వ తీరును వైఎస్ షర్మిల తప్పు పట్టారు. విద్యుత్ ఛార్జీలపై సర్కార్‌ది సర్దుబాటు కాదు ఇది, ప్రజలకు 'సర్దుపోటు' **మిగతాది 2లో...**

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## విద్యుత్ ఛార్జీల భారం మోపితే ఊరుకోం

(మొదటి పేజి తరువాయి)

కూటమి సర్కారు ప్రజలకు ఇచ్చిన భారీ కరెంటు షాక్. విద్యుత్ ఛార్జీల విషయంలో వైసీపీ చేసింది పాపం అయితే రాష్ట్ర ప్రజలకు కూటమి సర్కార్ పెడుతుంది శాపం. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏం సంబంధమని అన్నారు. ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే పడే అదనపు భారం ప్రజల నెత్తిన మోపుతారా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో వైసీపీ భారం రూ.35 వేల కోట్లు అయితే 5 నెలల్లో కూటమి భారం రూ.18 వేల కోట్లా అని ప్రశ్నించారు. వైసీపీకి మీకు ఏంటి తేడా అన్నారు. వైసీపీ 9 సార్లు ఛార్జీలు పెంచిందని, కూటమి అధికారంలో కొస్తే ఒక్క రూపాయి కూడా ఛార్జీలు పెంచమని, అవసరం అయితే 30 శాతం తగ్గించేలా చూస్తాం అని ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలపై కట్టుబడి ఉంటే, తప్పు ఎవరు చేసినా ఆ భారాన్ని ప్రజలపై మోపొద్దనే చిత్తశుద్ధి మీకుంటే.. వెంటనే రూ.18 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయండని' వైఎస్ షర్మిల ఏపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంపై పడుతున్న భారంపై నిధులు ఇవ్వాలని ప్రధాని మోదీని గల్లా పట్టి అడగండి. ప్రజల నుంచి ఒక్క రూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే ఊరుకోబోం. కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ హెచ్చరిస్తోందన్నారు. ప్రజల ముక్కు పిండి ట్రూఅప్ ఛార్జీల రూపంలో, అధిక కరెంటు బిల్లులు వసూల్ చేయడం దారుణం. వసూల్ చేయడాన్ని నిరసిస్తూ రేపటి నుంచి మూడు రోజుల పాటు కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు పిలుపునిస్తున్నాం అని వైఎస్ షర్మిల స్పష్టం చేశారు.

## అత్యాచారం వార్త అసత్యం

### ఇలాంటి వార్తలు రాసేప్పుడు జాగ్రత్త అవసరం

### తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు వెల్లడి



తిరుపతి, ఆంధ్ర ప్రగతి నవంబర్ 05:

తిరుపతిలో మైనర్ బాలికపై అత్యాచారం జరగనప్పటికీ జరిగినట్లు సా కథనం ప్రచురితం సరికాదని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు అన్నారు. అత్యాచారం జరిగిందని పాప గాని, పాప తల్లిదండ్రులు గాని చెప్పకపోయినా అత్యాచారం జరిగినట్టు ప్రచారం చేయడం నేరమన్నారు. ఫోక్సో చట్టం కింద కఠినమైన చర్యలు ఉంటాయన్నారు. మంగళవారం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. బాలికకు పీహెచ్‌సీలో మొదట వైద్య పరీక్షలు జరిగాయని... ఆ తరువాత తిరుపతి మెటర్నిటీలో కూడా నిష్ణాతులైన వైద్యుల చేత వైద్య పరీక్షలు కోసం రాత్రి తిరుపతికి తీసుకొచ్చినట్లు తెలిపారు. రేప్ జరిగిన ఆధారాలు లేవని తిరుపతి మెటర్నిటీలోని వైద్యులు రాత్రి స్పష్టంగా చెప్పారన్నారు. పాప స్టేట్‌మెంట్‌లో సందిగ్ధం ఉందని రాత్రి చెప్పామని.. రాత్రి మెడికల్ ఎగ్జామినేషన్‌లో అత్యాచారం జరగలేదని వైద్యులు చెప్పిన విషయం మీడియాకు కూడా చెప్పామని తెలిపారు. అయినా కొంతమందిలో ఎందుకు అంత ఉత్సాహం అంటూ మండిపడ్డారు. ఫోక్సో చట్టంలో మైనర్‌కు చాలా హక్కులు ఉన్నాయన్నారు. మళ్లీ ఇలాంటివి రిపీట్ కాకుండా చర్యలు ఉంటాయని తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు వెల్లడించారు. కాగా... తిరుపతిలో జిల్లాలో మైనర్ బాలికపై అత్యాచారం జరిగినట్లు సాక్షి పత్రిక మెయిన్ పేజీలో వార్త వచ్చింది. అయితే ఈ వార్తపై బాలిక తండ్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలికపై అత్యాచారం జరగలేదని స్పష్టం చేశారు.

## శాంతిభద్రతల పరిరక్షణలో కటువుగా ఉండాల్సిందే

(మొదటి పేజి తరువాయి)



రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తామని అనిత స్పష్టం చేశారు.

## మండలానికో ఇంటర్ కళాశాల

(మొదటి పేజి తరువాయి)

రిమోట్ ప్రాంతాల్లో జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేసే వారికి త్వరితగతిన అనుమతులు అందించాలని ఆదేశించారు. ఈ ఏడాది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించడం వల్ల 15 వేల వరకు అడ్మిషన్లు పెరిగాయనే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించారు. వచ్చే ఏడాది 2 లక్షల వరకు అడ్మిషన్లు పెరిగేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. జూనియర్ కాలేజీల్లో పనివేళలు పెంచడంతో పాటు విద్యార్థుల హాజరుపై సమీక్ష, ప్రోగ్రెస్ కార్డులను అందిస్తున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఉత్తమ అధ్యాపకులతో విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్సులకు శిక్షణ ఇప్పించాలని ఈ సందర్భంగా నారా లోకేశ్ సూచించారు. వచ్చే ఏడాది నుంచి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎన్ సీఈఆర్టీ బుక్స్ ప్రవేశపెట్టడంతో పాటు ప్రశ్నాపత్రంలోనూ మార్పులు చేయనున్నట్లు తెలిపారు.

## నిత్యకృత్యంగా అత్యాచారాలు

తిరుపతి ఆంధ్ర ప్రగతి నవంబర్ 05:

రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, హత్యాచారాలు నిర్మూలించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నేత రోజా అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గడిచిన 120 రోజుల్లో ఇలాంటి ఘటనలు 110 జరిగాయని రోజా మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా విఫలం అయ్యాయని, మహిళల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు.మహిళలపై వరుస అఘాయిత్యాలు జరుగుతుంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి అనిత ఏం చేస్తున్నారని ఆమె ప్రశ్నించారు. ఆంధప్రదేశ్‌లో మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు జరగకుండా చూడడంలో హోంమంత్రి అనిత సరిగా పనిచేయడం లేదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనడం వెనక కారణం ఏంటి?. దళితవర్గానికి చెందిన హోంమంత్రిపై నిందలు వేసి చేతులు దులుపుకోవాలని చూస్తున్నారా?. పిఠాపురం నియోజకవర్గంలో పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న బాలికకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినప్పుడు పవన్ ఎక్కడికి వెళ్లారు. చిన్నారిపై అఘాయిత్యం జరిగితే కనీసం బాధిత కుటుంబాన్ని పవన్ పరామర్శించలేదు. ఉత్తర్ ప్రదేశ్ సీఎం యోగి లాగా పనిచేయాలని ఆయన చెబుతున్నారు. యోగిలా పనిచేయమని ముఖ్యమంత్రి చంద్రబాబుకు పవన్ చెప్పాలి. అధికారం చేతిలో ఉన్న వాళ్లు తప్పులు జరగకుండా చూడాలి. కానీ సీఎం, డిప్యూటీ సీఎం, హోంమంత్రి తమ విధి నిర్వహణలో విఫలం అయ్యారు. ఇప్పుడు తిరుపతి ఘటనలోనూ నిజాన్ని కప్పిపుచ్చేందుకు బాలికను పరీక్షల పేరుతో అనేక ఆస్పత్రులకు తిప్పడం నిజం కాదా?. ప్రభుత్వం నుంచి తిరుపతి ఎస్పీకి ఎంత ఒత్తిడి వస్తుందో ఆయన మాటలు బట్టే అర్థం అవుతోందన్నారు. డీజీపీ నుంచి కిందస్థాయి సిబ్బంది వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన తనయుడు మంత్రి లోకేశ్ బదిలీలు చేసుకున్నారు. నచ్చిన వారికి పోస్టింగులు ఇచ్చుకుని ఇప్పుడు లైంగిక దాడులకు పాల్పడే నిందితులను కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. డమ్మీ హోంమంత్రిని పెడితే మహిళల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం అవుతోంది. వైసీపీ అధినేత జగన్ తిరుపతికి వస్తున్నారన్న సమాచారంతో బాధితులను బెదిరించి వారితో మాట్లాడిస్తున్నారని రోజా మండిపడ్డారు.

# సరస్వతీ ప్లాంట్ బాధితులకు అండగా ప్రభుత్వం

(మొదటి పేజి తరువాయి)





వైఎస్ఆర్ హయాంలో ఈ సరస్వతి పవర్ ప్రాజెక్ట్ తీసుకు వచ్చారని గుర్తు చేశారు. ఈ ప్రాంతంలో 400 ఎకరాల అటవీ భూములుంటే.. వాటిని రెవెన్యూ భూములుగా మార్చేసి లాక్కున్నారని పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా మండిపడ్డారు. 2009లో ఈ భూములను 30 ఏళ్లకు లీజుకు తీసుకుని.. మళ్లీ వాటిని 50 ఏళ్లకు పెంచారని చెప్పారు. తాము పరిశ్రమ ఏర్పాటు చేసి.. అందులో ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి.. ఈ భూములు విక్రయించేలా నాటి పెద్దలు నమ్మబలికారన్నారు. ఇష్టం లేకున్నా.. ఈ భూములు అమ్మాల్సిన పరిస్థితి తీసుకు వచ్చారని వివరించారు. అందుకోసం ప్రజలు, రైతులపై తీవ్ర ఒత్తిడి తీసుకు వచ్చారన్నారు. క్రమంలో పెట్రోల్ బాంబులు వేసి వారిని భయపెట్టారని గుర్తు చేశారు. ఇక ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావును వేధించి వేధించి చంపేశారన్నారు. ఫర్నిచర్‌పై కోడెలను వేధించిన వ్యక్తి.. ఎ÷-లాంట్ పేరుతో భూములు లాక్కున్నారంటూ వైఎస్ జగన్‌పై పవన్ కల్యాణ్ మండిపడ్డారు. ఎస్సీ కుటుంబాలకు చెందిన 24 ఎకరాల భూమిని భయపెట్టి మరీ తీసుకున్నారని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివరించారు.లా లాక్కున్న భూముల్లో 20 ఎకరాలు వేమవరంలోనే ఉన్నాయని చెప్పారు. అయితే ఎవరైనా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే మాత్రం ఊరుకునేది హెచ్చరించారు. అలాగే 24.78 ఎకరాల కుంటలు, చెరువులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. అలా భూములు లాక్కొని సొంత ఆస్తి మాదిరిగా కుటుంబంలో కొట్టుకుంటున్నారని డిప్యూటీ సీఎం వ్యంగ్యంగా పేర్కొన్నారు. సహజ వనరులు ఒకరి సొత్తు కాదు.. ఒకరి సొంతం కాదని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఇక పోలీస్ ఉన్నతాధికారులు సైతం మెత్తబడిపోయారన్నారు. లేకుంటే వారు సైతం భయపడుతున్నారా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. స్థానిక యువతను గత ప్రభుత్వంలోని వారు భయపెడితే ఊరుకుంటారా? పెట్రోల్ బాంబులు, నాటు బాంబులు వేసి బెదిరిస్తుంటే ఏం చేస్తున్నారంటూ ఈ సందర్భంగా పోలీస్ ఉన్నతాధికారులను డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులది కాదా? రౌడీయిజాన్ని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులదని పవన్ కల్యాణ్ గుర్తు చేశారు. వైసీపీ నాయకులు ఇంకా తమ ప్రభుత్వమే అధికారంలో ఉన్నదన్నట్లుగా ప్రవర్తిస్తున్నారంటూ నిప్పులు చెరిగారు. శాంతి భద్రతలు అంటే ఎంత బలంగా ఉంటాయో వాళ్లకు చూపించాలని పోలీస్ అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించారు.

# జనవరి కి జర్నలిస్టులకు కొత్త అక్రిడేషన్లు ఇస్తాం.!

**-అక్రిడేషన్ల పాత జీవో ను సవరించి కొత్త జీవో ఇస్తాం.**
**-ప్రమాద భీమా పథకాన్ని పునరుద్ధరిస్తాం.**
**-ఏపీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందంతో రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పార్థసారథి**



ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 05:
రాష్ట్రంలోని జర్నలిస్టులకు జనవరిలో కొత్త అక్రిడేషన్లు ఇచ్చేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చి తీరుతామని రాష్ట్ర పౌర సమాచార శాఖ మంత్రి పార్థసారథి వెల్లడించారు. మంగళవారం బాపట్లకు వచ్చిన ఆయనను ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసింది. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలన్ని అడిగి తెలుసుకున్నారు. ఐజేయు అధ్యక్షుడు , తెలంగాణ ప్రెస్ అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి ఫోన్ లో మంత్రి తో మాట్లాడుతూ అనేక అంశాలను వివరించారు. అనంతరం ఏపీయూడబ్ల్యూజే నేతలతో మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం జర్నలిస్టులకు అక్రిడేషన్లు కూడా ఇవ్వకుండా అన్యాయం చేసిందని, గత ప్రభుత్వం అక్రిడేషన్ల జారీ కోసం ఇచ్చిన జీవో ను మార్పు చేస్తామని చెప్పారు. అందుకోసం కొత్త నిబంధనలకు సంభందించి నివేదిక తయారు చేస్తున్నామని, అందరితో మాట్లాడి త్వరలో ఫైనల్ చేస్తామని చెప్పారు. అర్హులందరికీ అక్రిడేషన్లు ఇచ్చే విధంగా ముందుకు వెళ్తామన్నారు. అలాగే జర్నలిస్టుల కోసం పని చేసే సంఘాలకు కూడా అక్రిడేషన్ కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు జర్నలిస్టులకు ఇంటి స్థలం తో పాటు.. ఇళ్లు నిర్మించి ఇచ్చే అవకాశాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా 2018 లో సీఎం హోదాలో చంద్రబాబు జర్నలిస్టుల సంక్షేమానికి రూ.100 కోట్లు నిధి కేటాయించడంతో పాటు గృహ నిర్మాణ పథకాన్ని చేపట్టిన విషయాన్ని ఐవీ సుబ్బారావు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. దీనిపై పూర్తి స్థాయిలో పరిశీలించి వీలైనంత త్వరగా ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రారంభించి వైసీపీ ప్రభుత్వం ఆపివేసిన జర్నలిస్టుల ప్రమాద భీమా పథకాన్ని కూడా పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వానికి నిధులు ఇబ్బంది అయితే సొంతంగా నిధులు సమకూర్చి అయినా ప్రమాద భీమా పథకాన్ని పునరుద్ధరించి తీరుతామని స్పష్టం చేశారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అడిగి తెలుసుకొని వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రిని కలసిన వారిలో ఐవీ సుబ్బారావు తో పాటు జాతీయ సమితి సభ్యులు సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు,బాపట్ల జిల్లా అధ్యక్షులు రాంబాబు బాపట్ల జిల్లా యూనియన్ నాయకులు శ్రీనివాస రావు స్థానిక జర్నలిస్టులు ఉన్నారు.

# ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి

### -ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాలి -సిఐటియు


**ఈ నెల 18న నంద్యాల జిల్లా కలెక్టరేట్ దగ్గర జరిగే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆశాలకు సిఐటియు పిలుపు.**



ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 05:
ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఒప్పంద జీవోలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,మండల నాయకులు జె.వేణు కుమార్,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు టి.చిన్నమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.
ఈ మేరకు ఆశా డే సందర్భంగా డోన్ మండల పరిధిలోని చిన్న మల్కాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు మంగళవారం డాక్టర్. చెన్నకేశవులు కు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ గతంలో జరిగిన సమ్మె సందర్భంగా ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు రాష్ట్ర ప్రతినిధి వర్గంతో కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు జరిపిన చర్చల్లో కుదిరిన ఒప్పందాల జీవోలు మరియు సర్కులర్ లు వెంటనే విడుదల చేయాలన్నారు.
9 నెలలు కావస్తున్నా జీవోలు విడుదల కాక పోవడంతో ఆశాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు.ఈ మధ్య కాలంలో అనేక మంది ఆశాలను రిటైర్మెంట్ చేశారని 60 నుండి 62 సంవత్సరాలకు వయస్సు పెంపుదల జీవో విడుదల కాకపోవడంతో ఆందోళననెలకొందన్నారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్,బీమా సౌకర్యాలు అందడం లేదన్నారు.ఫీల్డ్ వర్క్, సెంటర్ వర్క్ పనిచేయని సెల్ ఫోన్లతో మెజారిటీ ఆశాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.గంట పర్మిషన్ కోసం,ఒకరోజు సెలవు కోసం అధికారుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడవలసి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు.కొత్త రికార్డ్స్ ఏప్రిల్ 1 నుండి నిర్వహించాల్సి ఉండగా నేటి వరకు సప్లై చేయలేదన్నారు.నెలకు ఒకసారి ఆశా డే జరుగుతుందని ఉదయం నుండి సాయంత్రం వరకు కార్యక్రమం ఉంటుందని చిన్న మల్కాపురం పీహెచ్సీలో ఆశాలు కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేవని గంటల తరబడి క్రింద కూర్చోలేక ఆశాలు అవస్థలు పడుతున్న విషయాన్ని డాక్టర్ దృష్టికి తెచ్చామని వారు సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఒప్పంద జీవోల విడుదల కోసం ఈనెల 18న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం ఉంటుందని అప్పటికీ సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సరళమ్మ, రాజేశ్వరి, వెంకటేశ్వరమ్మ,కళావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ విద్యా దినోత్సవ వ్యాసరచన పోటీలు.

**-భారతరత్న అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా**
**-నిర్వహణ నంద్యాల ఐఎంఏ, లయన్స్ క్లబ్.**
**-9వ తేదీ, పాఠశాల విద్యార్థులకు.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 05:
స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి,భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినోత్సవం సందర్భంగా నవంబర్ 11 జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని, ఐఎంఏ నంద్యాల,లయన్స్ క్లబ్ నంద్యాల సంయుక్త నిర్వహణలో ఈనెల తొమ్మిదవ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల భాషలలో వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరుగుతుంది. "మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం- సందేశం" అన్న అంశంపై 90 నిమిషాలు కేటాయించి వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. వ్యాసరచన రాయడానికి అవసరమైన కాగితాలు నిర్వాహకులు అందజేస్తారు.
పాల్గొనదలచిన వారు ఏడవ తేదీ సాయంత్రం 6 గంటలలోపు లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ 9866367560 నెంబర్ కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలి.
పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రం అందజేయబడుతుంది. తెలుగు, ఆంగ్ల భాషలలో వేరువేరుగా ప్రథమ, ద్వితీయ,తృతీయ మరియు రెండు స్పెషల్ జ్యూరీ విజేతలకు 11వ తేదీ రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించే కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ సహకారంతో బహుమతులుగా దేశ నాయకుల పుస్తకాలు, జ్ఞాపికలు,బహుమతి ప్రశంసా పత్రాలు అందజేయబడతాయి.
ఈ వ్యాసరచన పోటీలలో పాల్గొనవలసిందిగా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ రవికృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు, కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, కోశాధికారి సురేంద్ర నాథ్ రెడ్డి,లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నిజాముద్దీన్, శిరిగిరి రమేష్, కోశాధికారి మామిళ్ళ నాగరాజు పాఠశాల విద్యార్థులను ఆహ్వానిస్తున్నారు.

# వైసీపీ నేతలకు తొత్తులుగా నాడు అధికారులు.!

**-బుగ్గన బంధువుకు భూమిని కట్టబెట్టిన వైనం.-అప్పు ఇచ్చిన డబ్బులు అడుగుతుంటే ప్రాణాలు తీస్తామని బెదిరింపులు.**

**-పని కల్పిస్తామని విదేశాలకు తిసుకెళ్లి చిత్రహింసలు.-నేతలకు మొరపెట్టుకున్న బాధితులు. -మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట... మంత్రి ఫరూక్.**

ఆంధ్ర ప్రగతి అమరావతి నవంబర్ 05:
నంద్యాల జిల్లాలో వైసీపీ నేతలకు సహకరిస్తూ.. తమ భూమిని అప్పటి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బంధువు బీఆర్సీ బుగ్గారెడ్డికి అక్రమంగా రెవెన్యూ అధికారులు ఆన్ లైన్ చేశారని పాణ్యం మండలం గోరుకల్లు గ్రామానికి చెందిన సురేష్ బాబు తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. మంగళవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ లో సురేష్ బాబు టిడిపి నాయకులకు తనకు జరిగిన అన్యాయంపై వివరించారు. దీనిపై నాడు ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరించారని.. వారికి అక్రమంగా ఆన్ లైన్ చేసిన 14 సెంట్లను రద్దు చేసి ఈ అక్రమాలకు సహకరించిన అధికారిపై చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్ లో నేతలకు ఫిర్యాదు చేశాడు.అర్జీని స్వీకరించిన రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్లరామయ్య, మాజీ శాసనమండలి ఛైర్మన్ ఎంఏ షరీఫ్, బుచ్చిరాంప్రసాద్ లు అర్జీని స్వీకరించి న్యాయం చేస్తామని బాధితుడికి హామి ఇచ్చారు. అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగుతుంటే.. తనను, తన కుటుంబ సభ్యులను చంపేస్తామని చింతల చెరువు వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తి బెదిరిస్తున్నాడని.. అవసరం అంటే ఇంటి కాగితాలు



తాకట్టు పెట్టి రూ.32 లక్షలు అప్పుగా ఇచ్చానని. ఇప్పుడు డబ్బులు ఇవ్వను ఏం చేసుకుంటావో చేసుకోమంటున్నాడని తనకు వెంకటేశ్వరరెడ్డి నుండి రావాల్సిన డబ్బులు ఇప్పించి ఆదుకోవాలని విజయవాడకు చెందిన యక్కంటి కృష్ణారెడ్డి నేతల ముందు వాపోయాడు. పనిచూపిస్తానని తన భార్యను మస్కట్ తీసుకెళ్లి అక్కడ పనికల్పించకుండా తనకు తిండి పెట్టకుండా ఏజెంట్ ఇబ్బంది పెడుతున్నాడని,తన భార్యను ఇండియాకు తిరిగి పంపించమని అడిగితే డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని,ఏజెంట్ మల్లీడి సుబ్రహ్మణ్యంపై పాలకొల్లు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తల్లికోసం పిల్లలు బెంగ పెట్టుకున్నారని అంతేకాకుండా మస్కట్ లో ఉన్న తన భార్య ఆరోగ్య పరిస్థితి క్షీణించిందని,తనను ఎలాగైనా ఇండియాకు రప్పించాలని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన టి. రాజశేఖర్ నేతలకు విన్నవించుకొన్నాడు.

తన పొలాన్ని వైసీపీ నేతల కబ్జా చేస్తే.. న్యాయం కోసం పోలీసులు, అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడంలేదని.. తిరిగి తనపైనే దాడులకు దిగుతున్నారని కృష్ణా జిల్లా జి. కొండూరుకు చెందిన మేరెడ్డి సామ్రాజ్యం అనే మహిళ నేతలకు ఫిర్యాదు చేశారు. విచారించి తనకు న్యాయం చేసేలా చూడాలని కోరారు. కేంద్రం నుండి రిటైర్డ్ అయిన మాజీ ఉద్యోగులు తమ ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రులకు వెళ్లాలంటే నెల్లూరులో ఉండే సిజిహెచ్ఎస్ కు వెళ్లవలసి వస్తోందని దూరాభారంతో వృద్ధాప్యంలో ఇబ్బందులు పడాల్సి వస్తోందని.. కావున కర్నూలులో మరో ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర క్రిస్టియన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ ఏవైన్ బాబు రాజ్ నేతలను కోరారు.ప్రకాశం జిల్లా చిన్నగుడిపాడుకు చెందిన రమణబాబు అనే వ్యక్తి నేతలకు అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. దాదాపు నాలుగు తరాలుగా తమ పూర్వికుల పండిచుకుని అనుభవంలో ఉన్న భూమిని... కరువు రిత్యా ఉపాధి కోసం మరో ఊరికి వెళ్లగా.. అప్పటి నేతల చర్యలతో ప్రభుత్వం ఆ భూమిని వేరొకరికి కేటాయించిందని.. వారికి కేటాయించిన భూమిని రద్దు చేసి తమకు భూమిపై హక్కులు కల్పించాలని.. అలాగే ప్రభుత్వం ఎవరికైతే భూమి కేటాయించిందో వారికి న్యాయం జరిగేలా మరోక చోట భూమి కేటాయించాలని అలా కుదరని పక్షంలో తమకు మరోక చోట అంతే భూమిని కేటాయించాలని విన్నవించుకున్నాడు.

**మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. మంత్రి ఫరూక్**

గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలో కొత్త మసీదుల నిర్మాణం, మరమ్మతులకు నిధులు, షాదిఖానాల నిర్మాణం, చర్చిల నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేసినప్పటికీ, వైసిపి ప్రభుత్వం నిధులను నిలిపివేసిందని వెంటనే మైనార్టీల సంక్షేమం కోసం నిలిచిపోయిన మైనారిటీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని పలువురు ప్రతినిధులు మైనార్టీల తరఫున మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ కు విన్నవించారు. ఈ విషయంపై మంత్రి ఫరూక్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. ఇప్పటికే మైనార్టీల సంక్షేమం కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కార్యాచరణ బద్ధంగా చర్యలు చేపట్టడం జరిగిందని, మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఉపాధి కోసం కువైట్ దుబాయ్ గల్ఫ్ దేశాలకు వెళ్లేవారు ఏజెంట్ల చేతిలో మోసపోయి ఆయా దేశాల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఏజెంట్ల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుందని మంత్రి ఫరూక్ బాధితులకు హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు సీఎం ఆర్ఎఫ్ సాయం కోసం అర్జీలు తీసుకురాగా.. మరికొందరు నామినేటెడ్ పదవులు ఆశిస్తూ.. నేతలు అర్జీలు ఇచ్చారు. వివిధ సమస్యలపై తమకు న్యాయం చేయాలంటూ పలువురు నేతలను వేడుకున్నారు.

# సీప్లేన్ విధాన ఏర్పాట్లను పరిశీలించిన

## జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్

ఆంధ్ర ప్రగతి శ్రీశైలం, నవంబర్ 05:
రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని... ఇందులో భాగంగానే సీప్లేన్ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉందని అందుకు తగ్గ ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. మంగళవారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తో పాటు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ లతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పాతాళ గంగ వద్ద బోటింగ్ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మీడియా విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ కృష్ణా నది పున్నమి ఘాట్ నుంచి విజయవాడ – శ్రీశైలం మధ్య సీప్లేన్ ప్రారంభానికి రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారన్నారు. విజయవాడలో ప్రారంభమైన సీప్లేన్ నల్లొండ టన్నెల్ వద్ద ల్యాండ్ అయి పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ప్లాస్టిక్ జెట్ కు చేరుకొని రోప్ వే ద్వారా శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి సందర్శిస్తారన్నారు. ఇందుకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, గ్రీన్ రూమ్, విఐపి ల సీటింగ్ అరేంజ్మెంట్ తదితర ఏర్పాట్లను



పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రోప్ వే ఎంట్రీ పాయింట్ వెలుపల ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేసి ఎల్ 1, గ్రీన్ రూమ్ ఏర్పాటు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే త్రాగునీటి వసతి, పార్కింగ్, తాత్కాలిక టాయిలెట్ల ఏర్పాట్లకు కూడా చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను సూచించారు. దేవస్థాన పరిధిలో ముఖ్యమంత్రి ఏర్పాట్లపై కలెక్టర్, ఎస్పీలు దేవస్థాన ఈఓతో మాట్లాడి పలు ఆదేశాలు జారీ చేశారు. పాతాళ గంగ బోటింగ్ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ జెట్ ను పరిశీలించారు. ల్యాడర్ కు



డెకరేషన్ చేయాలన్నారు. రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో ముమ్మర పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు. ఏర్పాట్లలో తేడా వస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. రోప్ వే పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ, దేవస్థాన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్లాస్టిక్ జెట్ ఏర్పాటుతో పాటు ల్యాడర్ కు డెకరేషన్, రోప్ వే భవనం, క్యాబిన్, నడకదారుల్లో పారిశుధ్య చర్యలు చేపట్టి పెయింటింగ్ వేసి ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దాలన్నారు.

# ఏఐఎస్ఎఫ్ రెండవ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి.

**-ఈ నెల 14 న నంద్యాల పట్టణంలో.గోస్పాడు మండల కమిటీ సమావేశంలో పిలుపునిచ్చినఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయ్.**



ఆంధ్ర ప్రగతి గోస్పాడు నవంబర్ 05:
గోస్పాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మోడల్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఈనెల 14న నంద్యాల పట్టణంలో జరగబోయే ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా రెండవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చిన ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కోశాధికారి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రిస్వామి, ఏఐఎస్ఎఫ్ నంద్యాల పట్టణ నాయకులు తరుణ్. సమావేశం అనంతరం గోస్పాడు మండల నూతన కమిటీని 11 మందితో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హై స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు

# విద్యారంగ సమస్యలు పరిష్కారానికి కలెక్టర్ కార్యాలయం ముట్టడి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్, 05:**
పెండింగ్ లో ఉన్న విద్యా దీవెన,వసతి దీవెన బకాయిలు విడుదల చేయాలని విద్యారంగం సమస్యల పరిష్కారానికి చలో కలెక్టరేట్ కార్యక్రమం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ గా వెళ్లి కలెక్టర్ కార్యాలయంలో ముట్టడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నంద్యాల జిల్లా అధ్యక్షులు జిల్లా కార్యదర్శి రాజా,ఎం ఆర్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వసతి దీవెన, విద్యా దీవెన బాకాయిలు 3480 కోట్ల రూపాయలు పెండింగ్లో ఉన్నాయని వీటిని విడుదల చేస్తామని అధికారంలోకి రాకముందు చెప్పినటువంటి కుటమి ప్రభుత్వం నాయకులు నేడే అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం దానిమీద మాట్లాడటం లేదని విమర్శించారు. చదువు పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాలలో ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు పడకపోవడం వలన తమ సర్టిఫికెట్ల కోసం పడరాని పాట్లు పడుతున్నారని, అదే విధంగా గత పది రోజులు నుండి రాష్ట్రంలో అనేక యూనివర్సిటీలో మరియు మన జిల్లాలో ఉన్నటువంటి ఇంజనీరింగ్ కాలేజీల్లో పిజి రియంబర్స్మెంట్





డబ్బులు ప్రభుత్వం వేయకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులే ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడంతో ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు కడతే గాని పరీక్ష ఫీజులు కట్టించుకోమని విద్యార్థులను ఇబ్బందులు గురి చేస్తున్నాయి. కావున తక్షణం పెండింగ్ లో ఉన్న విద్యాదివెన,వసతి దీవెన డబ్బులు వేయాలని ఈ సంవత్సరం ఫీజు రియంబర్స్మెంట్ డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ సెకండియర్ వరకు చదువుకునేటువంటి విద్యార్థులకు ఇస్తామన్న తల్లికి వందనం డబ్బులు మీద స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబరు 77 వలన పేద మధ్యతరగతి విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ చదివేటటువంటి అవకాశం పోయిందని తక్షణమే జీవో నెంబర్ 77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, జిల్లాలో శిథిల వ్యవస్థలో ఉన్న హాస్టల్ భవనాలకు నూతన భవనాలు నిర్మించాలని, హాస్టల్ విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక,ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలోని బాలుర కళాశాల వసతి గృహాలలో తాగునీటి సదుపాయాలని ఏర్పాటు చేయాలి. గవర్నమెంట్ ఐటిఐ కళాశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలి.

బాలికల కళాశాల వసతి గృహాలలో అదనపు గదులను ఏర్పాటు చేసి నీటి సదుపాయం కల్పించాలి.

పాలిటెక్నిక్ కళాశాల బాలుర వసతి గృహాని ఏర్పాటు చేయాలి.

జిల్లాలోని అద్దె భవనాలలో ఉంటున్నటువంటి సాంఘిక సంక్షేమ,గిరిజన,వెనుకబడిన వసతి గృహాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలి.మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి. ఈ సమస్యలపై డి ఆర్ వో కి వినతిపత్రం అందించారు, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిల్లా అధికారులు సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయుకులు హరివర్ధన్, కిషోర్,అశోక్,శివకుమార్,సంతోష్,మధు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తూ పోలీసులు

**ఆంధ్ర ప్రగతి**
**నంద్యాల జిల్లా నవంబర్ 05:**



నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల నంద్యాల జిల్లా లోని వివిధ పోలీస్ స్టేషన్ ల పరిదిలో విజిబుల్ పోలీసింగ్ మరింత కట్టుదిట్టం చేసి జిల్లాలో పోలీస్ అధికారులు వారి సిబ్బంది సహాయంతో ముఖ్యమైన కూడళ్ళ నందు లా %డ% ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేస్తూ, రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు చేస్తూ, మోటార్ వాహనాలు చట్టం ప్రకారం నియమ నిబంధనలను పాటించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణ చేస్తున్నారు.ప్రతి రోజు జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ నిర్వహణ జరుగుతుంది.ఈ విజిబుల్ పోలీసింగ్ లో ట్రిపుల్ రైడింగ్, వాహనానికి సరైన నెంబర్ ప్లేట్లు లేనివారిని, వాహన సంబంధిత రికార్డులు లేనివారిని, హెల్మెట్ లేకుండా మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులను, సెల్ ఫోన్ డ్రైవింగ్,మరియు రాష్ డ్రైవింగ్ చేసే వారిని గుర్తించి జరిమానా విదించడంతో పాటు , వారికి జిల్లా పోలీస్ అధికారులచే రోడ్డు భద్రతా, మోటార్ వాహనాల చట్టం నియమ నిబంధనలు గురించి,యువత చెడుమార్గం వైపు మల్లకుండా అవగాహన చేస్తున్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు గుర్తించిన బ్లాక్ స్పాట్స్ ల వద్ద స్పీడ్ బ్రేకర్లు సూచించేలా హెచ్చరికల బోర్డులు గమనించాలని ,జాతీయ రహదారులపై స్పీడ్ గన్స్ తో వేగ నియంత్రణకు కృషి చేస్తున్నారు. డ్రంకన్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్ లపై ప్రధానంగా దృష్టి ఉంచి నివారణకు కృషి చేస్తున్నామన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపకుండా ఉండేలా, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయకుండా, పరిమితికి మించి ప్రయాణీకులు వాహనాల్లో వెళ్ళకుండా పలు జాగ్రత్తలు పాటిస్తే దాదాపు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని వాహనదారులకు పోలీసు అదికారులు అవగాహన కల్పిస్తున్నారు.పోలీసులు సూచించే నిబంధనలు పాటిస్తూ, ఇతరులకు ఇబ్బందులు కలిగించకుండా సురక్షితంగా గమ్యం చేరాలని, ప్రాణనష్టం జరగకుండా తమ ప్రాణాలను రక్షించుకోవాలని ఈ సంధర్భంగా పోలీసు అదికారులు తెలియజేశారు.



# నవంబర్ 21 న ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం జయప్రదం చేయండి.

**-మత్స్య సహకార సంఘము జిల్లా అధ్యక్షులు బి ఎస్ నవీన్ కుమార్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 05: సాంప్రదాయ మత్స్యకారులైన బెస్తలు,ప్రాథమిక మత్స్య సహకార సంఘాలు వివిధ సమస్యలతో కొట్టుమిట్టడుతున్నాయని అందులో భాగంగ మంగళవారం ఉదయం 11 నంద్యాల పట్టణంలోని సూరజ్ గ్రాండ్ హోటల్లో బెస్తల ఆత్మీయ సమావేశం మార్కెట్ ప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమ నికి ముఖ్య అదితిగ మత్స్య సహకార సంఘాల జిల్లా అధ్యక్షులు బి ఎస్ నవీన్ కుమార్ హాజరై ప్రశాంగించారు.అనంతరం అయన మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్ లో మత్స్యకారులు చైతన్య వంతులై ప్రభుత్వం నుండి వచ్చే వివిధ సంక్షేమ పథకాలు వినియోగించుకొని అభివృద్ధి చెందాలన్నారు అందులో భాగంగ ఈ నెల 21 ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ప్రభుత్వం నిర్వహించె కార్యక్రమం నంద్యాలలో జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గగ్గెర వెంకటరమణయ్య, పాణ్యం సుబ్బయ్య,పి జి వెంకటేష్,ప్రసాద్, బుజ్జి,బేతాంచర్ల రమణ హరీష్, అరుణ్, వెంకటశివుడు, తమడపల్లె వెంకటేశ్వర్లు మల్లేశ్వరుడు గుర్రప్ప పెద్ద స్వామి లాయర్ విద్యా కమిటీ చైర్మన్ వెంకటరాముడు .వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏపీ గవర్నమెంట్ స్కూల్ స్వీపర్సు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి




ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 05: ప్రభుత్వ పాఠశాలలో ఆయాల సంఘం సమావేశం స్థానిక నంద్యాల సిపిఐ పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి డి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగినది . సమావేశంలో ఆయాల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి. శివ బాలకృష్ణ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలకు నాలుగు నెలల నుండి జూలై ఆగస్టు సెప్టెంబర్ అక్టోబర్ నెలలకు ఇంతవరకు జీతాలు ఇవ్వలేదని అతి తక్కువ వేతనంతో పనిచేస్తున్న ఆయాలకు జీతాలు ఇవ్వకుండా ఎలా పనిచేస్తారని బాలకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు .వెంటనే నాలుగు నెలల జీతాన్ని విడుదల చేయాలని , ఆయాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, నెలకు రెండు రోజులు సెలవు ఇవ్వాలని నెలకి రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని, వారిపై రాజకీయ వేధింపులు అరికట్టాలని, ప్రతినెల జీతం ఇవ్వాలని ,అలాగే 108 జీవో ప్రకారంగా నెలకు 11,500 జీతాలు చెల్లించాలని ,అలాగే వారిని అవుట్సోర్సింగ్ కార్మికులుగా గుర్తించాలని తదితర డిమాండ్స్ ని వెంటనే పరిష్కరించాలని బాలకృష్ణ ప్రభుత్వ అధికారులను కోరారు. ఈ సమస్యలను చర్చించి తగిన కార్యక్రమాలు రూపొందించుటకు ఈనెల 10వ తారీఖున ఆయాల సంఘం రాష్ట్ర మహాసభ ఏలూరులో జరుగుతున్నందున ప్రతి ఒక్కరూ విధిగా పాల్గొని ఆ యొక్క రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆయాలకు పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో నాగేంద్ర తదితర కార్మికులు పాల్గొన్నారు.

# పెంచికలపల్లిలో ప్రారంభమైన తితిదే ధార్మిక కార్యక్రమాలు

**-డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, తితిదే.**


**-భారతీయ కాలమానం ప్రకారం ప్రతి మాసానికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నది.**




ఆంధ్ర ప్రగతి పాములపాడు నవంబర్ 05: భారతీయ కాలమానం ప్రకారం ప్రతి మాసానికి ఒక విశిష్టమైన స్థానం ఉన్నదని, అందుకే ఆయా మాసాలలో ఆయా నియమాలు, వ్రతాలు, వివిధ రకాల ఆచారాలు ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా, పాములపాడు మండలం, పెంచికలపల్లి గ్రామంలో వెలసిన శివాలయం నందు నాలుగు రోజుల ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ప్రారంభోత్సవ సందర్భంగా వారు ప్రారంభోపన్యాసం చేశారు. వనభోజనాలు సామాజిక అస్పృశ్యతను తొలగించి సామాజిక సమరసతను కలిగిస్తాయని అన్నారు. మన భారతీయ ఆచారవ్యవహారాలలో ప్రతి ఆచారం వెనుక శాస్త్రీయ విజ్ఞానం ఉన్నదని అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు ధార్మిక ప్రవచకులు ఆమంచి వేంకటేశ్వర శర్మ మాట్లాడుతూ సమాజంలో ధార్మిక నిష్ఠ ఏర్పడినప్పుడే ఆత్మశక్తి పెరుగుతుందని అన్నారు. అందుకు శ్రీమద్రామాయణం లోని వివిధ సంఘటనలను సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు బి. నాగలింగమయ్య, అర్చకులు ఎస్. మౌళాలి గౌడ్, కె.నారాయణ గౌడ్, యం నారాయణ, జి. నాగలింగమయ్య గౌడ్, యం. రాజేశ్వరరావు, యం. నాగరాజుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గ్యాస్ సిలిండర్లు పేలి పూరి గుడిసెలు దగ్ధం

**-ఐదు లక్షల నష్టం..**



ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 05 గ్యాస్ సిలిండర్లు పేలి గుడిసెలు దగ్ధమైన ఈ ఘటన మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. కొత్తకోట్టాలకు చెందిన తండ్రి నక్క సుబ్బుడు, తన కుమారుడు లింగమయ్య మేకలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో మంటలు చెలరేగి, రెండు గ్యాస్ సిలిండర్లు పేలి, గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించడంతో, ఒక్కసారిగా స్థానికులు ఉలిక్కిపడ్డారు. వెంటనే గమనించిన స్థానికులు మంటలార్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న నంద్యాల అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. అప్పటికే పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో గుడిసెల్లో ఉన్న సుమారు రూ. లక్ష రూపాయల నగదు, రెండు తులాల బంగారం, మూడు మేక పిల్లలు,సామగ్రి, బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు 5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు.తమని ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

# విజయవాడలో జరుగు "ప్రజా హక్కుల సభ"ను జయప్రదం చేయండి.!



ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 05: మతతత్వ రాజకీయాలు చేస్తున్న ఎన్.డి.ఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీయండి! గత ఎన్నికలలో ఎన్.డి.ఏ కూటమి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 2024 డిసెంబర్ 4 న సిపిఐ (యమ్.యల్) లిబరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో జరుగు "ప్రజా హక్కుల సభ"ను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కర్నూల్ నగరంలోని సంక్షేమ భవన్ ఆవరణంలో కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ. నాగరాజు, జిల్లా కన్వీనర్ మునుస్వామి జిల్లా నాయకులు రవిరాజు మాట్లాడుతూ కేంద్రంలో ఎన్.డి.ఏ నాయకత్వంలోని మోడీ ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి మతతత్వ రాజకీయాలను కొనసాగిస్తుందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రాధాన్యత పేరుతో ఆర్.ఎస్.ఎస్ సభ్యుల్ని కీలకమైన ఉన్నత పదవుల్లో నింపడానికి ప్రయత్నిస్తుందని దుయ్యబట్టారు. దేశంలో ఉన్నత చదువులు చదివిన యువతతో ప్రభుత్వరంగ సంస్థలలో వున్న ఖాళీలను భర్తీ చేసి, నిరుద్యోగాన్ని నిర్మూలించవలసిన ఎన్.డి.ఏ కూటమి ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తూ నిరుద్యోగాన్ని పెంచిపోసిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలన సాగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన "సూపర్ సిక్స్" లాంటి హామీలను, రోడ్లు, ఇతర మౌలిక అవసరాలను తీర్చకుండ, ప్రజల దృష్టిని మళ్లించడానికి తిరుపతి లడ్డు, సనాతన ధర్మం అని మతతత్వ రాజకీయాలను సృష్టించిందని విమర్శించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక మతతత్వ రాజకీయాలకు నిరసనగా భారత రాజ్యాంగం కల్పించిన ప్రజల హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (యమ్.యల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో 2024 డిసెంబర్ 4న విజయవాడలో జరుగు "ప్రజా హక్కుల సభ"లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా రాష్ట్రంలో నిత్యావసర వస్తువులతో పాటు నిర్మాణ రంగ మెటీరియల్ కూడ విపరీతంగా పెరిగి పోవడంతో సామాన్యులు సొంత ఇంటిని నిర్మించుకునే స్థాయిలో లేరని, ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన పేదలకు ఇళ్ల స్థలం కేటాయించి, ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, కొత్తగా పెళ్ళైన ప్రతి కుటుంబానికి జాబ్ కార్డులు ఇవ్వాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి వంద రోజులు పూర్తిగా పని కల్పించాలని, అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని, 18 సంవత్సరాల దాటిన ప్రతి మహిళకు 1500 రూపాయలు ఇవ్వాలని, గ్యాస్ ఏజెన్సీల గోడౌన్ల వద్ద డబ్బులు చెల్లించకుండానే ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పై డిమాండ్ల పరిష్కారానికై, భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగం కల్పించిన ప్రజా హక్కులను కాపాడుకొనుటకై 2024 డిసెంబర్ 4న రాష్ట్ర రాజధాని విజయవాడలో జరుగు "ప్రజా హక్కుల సభ"లో పాల్గొని విజయవంతం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అనంతరం "ప్రజా హక్కుల సభ" కరపత్రాన్ని విడుదల చేయడం జరిగింది.

# విద్యారంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న మోడీ, చంద్రబాబు ప్రభుత్వాలు

**పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ**







కేంద్రంలోని మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెడుతున్నాయని పి.డి.ఎస్.యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ విమర్శించారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు ) 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పిడిఎస్ యు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ది.5.11.2024న నంద్యాలలో పట్టణంలో పద్మావతి సర్కిల్ నుండి 1500 మంది విద్యార్థులతో భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటినరీ టౌన్ హాల్లో "వసంత మేఘ గర్జన సభ" జరిగింది. ఈ సభకు పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ఎండీ.రఫీ అధ్యక్షత వహించారు.

ఈ సభకు ముఖ్య వక్తగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ 1960 దశకం చివర్లో నక్సల్బరీ వసంత మేఘ గర్జన ప్రేరణతో ఆవిర్భవించిందే పిడిఎస్.యు అని అన్నారు. పిడిఎస్యు విప్లవ విద్యార్థి ఉద్యమంలో కామ్రేడ్స్ జార్జిరెడ్డి, జంపాల చంద్రశేఖర్ ప్రసాద్, శ్రీపాద శ్రీహరి, కోలాశంకర్ , చేరాలు , సాంబయ్య, వరహాలు, నారాయణ, రంగవల్లి వంటి వారెందరో అమరులయ్యారని అన్నారు. సరిగ్గా ఇదేరోజు 1975 నవంబర్ 5న విప్లవ మేధావి, ఎమ్మెల్సీ నీలం రామచంద్రయ్య, పిడిఎస్యు నిర్మాత కామ్రేడ్ జేసిఎస్ ప్రసాద్ లను పోలీసులు విజయవాడలో అరెస్టు చేసి, చిత్రహింసలకు గురిచేసి, కాల్చి చంపారని అన్నారు. విద్యార్థి అమరవీరుల స్ఫూర్తితో శాస్త్రీయ విద్యా సాధన కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 52 సంవత్సరాల క్రితం కామ్రేడ్ జార్జిరెడ్డిని హత్య చేసిన మతోన్మాద శక్తులు నేడు దేశాన్ని పరిపాలిస్తున్నాయని అన్నారు. మోడీ పాలనలో యూనివర్సిటీలు అగ్రకుల అగ్రహారాలుగా మారాయని విమర్శించారు. వేలాది ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, టీచింగ్- నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలతో యూనివర్సిటీ విద్య సంక్షోభంలో కూరుకుపోయిందని అన్నారు. విద్యా రంగాన్ని కార్పొరేటీకరణ, కాషాయికరణ, కేంద్రీకరణ చేయడం కోసమే నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చిందని మోదీ ప్రభుత్వాన్ని విమర్శించారు. లౌకిక, ప్రజాస్వామిక హక్కులను హరించి వేస్తుందని దుయ్యబట్టారు.

ఈ సభలో ఏపీటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాల విద్యను ధ్వంసం చేసే 117 జీవోను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పిడిఎస్ యు జాతీయ నాయకులు యు.గనిరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం హిందూ ఫాసిస్ట్ విధానాలను అవలంబిస్తుందని, దేశ సంపదను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబడుతుందని విమర్శించారు.

# అయ్యలూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం.






ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 05: నంద్యాల మండలం అయ్యలూరు మరియు పెద్ద కొట్టాల గ్రామాల లో సహాయ వ్యవసాయ సంచాలకులు నంద్యాల వారు రాజ శేఖర్ మరియు మండల వ్యవసాయ అధికారి ఇ. ప్రసాద రావు ఆధ్వర్యములో పొలంపిలుస్తోంది కార్యక్రమము నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, నంద్యాల వారు మాట్లాడుతూ అయ్యాలూరు గ్రామంలో బ్లాక్ రైస్ వరి పంటను పరిశీలించడం జరిగింది. బ్లాక్ రైస్ చెక్కర వ్యాధి గ్రస్తుల కు చెక్కర వ్యాది ని అదుపులో ఉంచుతుంది అని ,అదేవిధంగా ప్రోటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని, అదేవిధంగా ఆన్లైన్ మార్కెటింగ్ ద్వారా వ్యవసాయ ఉత్తులను విక్రయించుకునే విధానం గురించి మరియు మై స్టోర్ అప్లికేషన్ ద్వారా ఆన్లైన్ మార్కెటింగ్ ఎలా చేస్కోవాలి అనేది వివరించడం జరిగింది.

తర్వాత వ్యవసాయ అధికారి నంద్యాల వారు మాట్లాడుతూ ప్రస్తుతం అమలు పరుస్తున్న పథకాలు గురించి వివరించడం జరిగింది. అలాగే ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు మరియు సస్యరక్షణ చర్యల గురించి వివరించడం జరిగింది.ప్రస్తుతం వరి పంట గింజ కట్టే దశలో ఉన్నదని ప్రస్తుత వాతావరణ పరిస్థితుల లో వరి పంటను అగ్గితెగులు మరియు మాని పండు తెగులు ఆశించడం జరిగిందనీ, అగ్గి తెగులు నివారణకు ట్రిసైక్లోజోల్ 0.6 గ్రా ఒక లీటరు నీటికి మరియు మానిపండు తెగులు నివారణకు కార్బండిజం 1 గ్రా ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలపడమైనది.వ్యవసాయ శాఖ ద్వారా రబీ పంట కాలం లో పంటల భీమా పథకం అమలు చేయడం జరుగుతుంది , ప్రస్తుతం రబీ 2024-25 కాను శనగ గ్రామ యూనిట్ గా, వరి, జొన్న, మినుము మండలం యూనిట్ గా , వేరు శనగ, ఉల్లి జిల్లా యూనిట్ గా పంటల భీమా పథకం లో చేర్చారని తెల్పారు. శనగ పంట రైతూ వాటా ఏకరానికి రూ 84/-, వరి కి రూ 126/-, జొన్న - రూ 59/-, మినుము - రూ 48/- రైతులు తమ వాటా ప్రీమియం అమౌంట్ కట్టుకోవడానికి వరి పంట డిసెంబర్ 31 లొపు, మిగతా పంటలకు డిసెంబర్ - 15 ,లోపు నిర్ణయించడం జరిగిందనీ,తదుపరి వివరాలకు రైతు సేవ కేంద్ర సిబ్బంది నీ సంప్రదించాలి అని తెలపడమైనది.

ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ముక్తార్ భాష, రైతు సేవ కేంద్రం సిబ్బంది అనీల్ ,మాధురి మరియు అయ్యలురు మరియు పెద్ద కొట్టల గ్రామ రైతు సోదరులు మరియు ఇరు గ్రామాల సర్పంచులు ఓబులేసు మరియు వెంకట రాముడు పాల్గొన్నారు.